# వారాలబ్బాయి

శిల్పకి ఆరోజు ఆ సంబంధం వాళ్ళు పెళ్ళిచూపులకి వచ్చివుండకపోతే ఈ కథ ఎప్పటిదో ఏభైయేళ్లనాటి సంగతి గుర్తు తెచ్చుకోవలసిన అవసరం కలిగేది కాదు. పెళ్ళి చూపులకి వచ్చిన పెద్దమనిషి, ఆ జడ్జిగారు ఆనాటి వారాలబ్బాయి' వెంకటరమణ, అమెరికా పెళ్లికొడుకు తండ్రి అవతారంలో కనిపిస్తాడని కలలో కూడా ఊహించి ఉండికపోవడంతో కాస్త షాక్ తగిలింది నాకు.

ఆపెద్దమనిషి వస్తూనే గుమ్మంలో ఎదుర్కోవడానికి వెళ్లిన నన్ను పట్టి పట్టి చూస్తూ లోపలికి వచ్చాడు. అమ్మమ్మ హోదాలో వున్నా ఆ చూపులు కాస్త ఇబ్బంది కలిగించాయి. అంతా పలకరింపులు, పరిచయాలు అయ్యాక, అంతా కూర్చున్నాక ''క్షమించండి, మీరు మాణిక్యమ్మగారి అమ్మాయిగారు కదూ'' అనడిగేశాడు ఆయన ఉండబట్టలేనట్టు. ఆశ్చర్యంగా చూస్తూ తల ఆడించి, ''మీకు మా అమ్మ తెలుసా?'' అన్నాను.

''మీరు నన్ను గుర్తుపట్టినట్టు లేదు. నేను వెంకటరమణ నండి, అప్పుడు మీ ఇంటికి 'వారం' వచ్చేవాడిని. రామచంద్రపురంలో గుర్తులేదా ఎప్పుడో ఏభైయేళ్లనాటి సంగతి లెండి, మర్చిపోయుంటారు'' అన్నాడాయన.

అప్పుడు పదకొండో, పన్నెండేళ్లుంటాయేమో తనకి, వారాలబ్బాయి! సన్నగా, పీలగా, చామనఛాయగా, బెదురుచూపులు చూచే, ఆడపిల్లలని చూసి సిగ్గుపడి తలదించుకునే, ఆ పదిహేనేళ్లబ్బాయి, వారం వారం ఓ రోజు మా ఇంటికి భోజనానికి వచ్చే ఆ వెంకటరమణా ఈయన! కాస్త బట్టతల, వడ్డు పొడుగు, రంగు వచ్చి హుందాగా కళ్ళజోడుతో, ఉద్యోగంతో వచ్చిన దర్పంతో అమెరికా ఇంజనీరు తండ్రి హోదాలో ఉన్న హైకోర్టు జడ్జి ఆనాటి వాలారబ్బాయి అని ఎవరు

మాత్రం అనుకుంటారు. ఎవరు మాత్రం గుర్తిస్తారు. ఆయన చెప్పకపోతే ఎంత మాత్రం గుర్తించలేకపోయేదాన్ని.

''వెంకటరమణ, మీరా!... ఆ... ఆ... గుర్తు వచ్చింది. ఎంతాశ్చర్యం. ఏభైయేళ్ల తరువాత ఇలా కలుసుకోవడం ఈ అబ్బాయి మీ అబ్బాయా'' కొడుకు పొడుగ్గా రంగు ఉన్నాడు. భార్య తెల్లగా బొద్దుగా ఉంది. ఆమెరికా ఇంజనీరు ఉద్యోగం, అమెరికా పెళ్లికొడుకు ఖరీదైన వేషం దర్జా అతనిలో కనిపిస్తూంది.

''వీడు ప్రసాద్, మామూడో అబ్బాయి. మా పెద్దబ్బాయి డాక్టర్ ఇంగ్లాండ్‌లో ఉంటాడు. రెండోవాడు ఇంజనీరు అమెరికాలో ఉన్నాడు. అమ్మాయి భర్త ఐ.ఏ.ఎస్, ఢిల్లీలో వుంటారు. వీడు అందిరకన్నా చిన్నవాడు'' అయన చాలా గొప్పగా, గర్వంగా చెప్పాడు. నిజమే పిల్లలంతా ఇంతపైకొచ్చి మంచి పొజిషన్‌లో ఉంటే ఏ తండ్రికైనా గర్వమేగా. మంచి సంబంధం అనే కదా మేమూ మనవరాలికి చూసింది. అదీ ఇంజనీరింగ్ చేసి అమెరికా వెళ్లి ఎమ్మెస్ చేసి ఉద్యోగం చేస్తూంది. అందుకే అమెరికా అబ్బాయి కోసం వెతికాం. పేపర్లో ప్రకటన చూసి అప్లై చేశారు మావాళ్లు. అన్ని వివరాలు ఆరా తీసే పెళ్లిచూపులకి పిల్చాం.

''మీ అమ్మగారు మహాతల్లి, సాక్షాత్తు అన్నపూర్ణే అనిపించేవారు ఎంతమంది ఇళ్లలోనో వారాలు తిన్నాను. మీ అమ్మగారు ఆప్యాయంగా కడుపు నిండా తిండి పెట్టేవారు. తప్పదన్నట్టు విసుక్కుంటూ కాక గౌరవంగా మీతో సమంగా పెట్టేవారు భోజనం. ఆవిడ బాగున్నారండీ'' కాస్త సందేహిస్తూ అడిగారాయన.

''ఆ! ఉందండి! తొంభైయేళ్లు. బాగా పెద్దదయింది. ఆరోగ్యం ఈ మధ్య బాగా మందగించింది. ఈ ఊర్లోనే ఉంది. మా తమ్ముడుంటాడక్కడ'' అన్నాను.

''ఆ! ఉన్నారా! ఇంకా ఉన్నారా! అయితే ఒక్కసారి ఆవిడని దర్శించుకుని దండం పెట్టుకుంటాను. అలాంటి మహాతల్లుల దయలేకపోతే ఈనాడు ఈస్థాయికి ఎదగగలిగేవాడినా అన్నారాయన. ''ఒక్కసారి నన్నావిడ దగ్గరకి తీసుకెడతారా'' ఆరాటంగా చాలా కృతజ్ఞత కురిపిస్తూ అన్నారు జడ్జిగారు.

''తప్పకుండా తీసుకెడతా, ఈ తంతు కానీండి. మా అమ్మా సంతోషపడ్తుంది మిమ్మల్ని, పెళ్లి కొడుకునీ చూసినట్లుంటుంది'' అన్నాను.

పెళ్ళికొడుకు, పెళ్లికూతురు మాట్లాడుకోవడానికి వేరేగదిలోకి వెళ్లినప్పుడు పాతసంగతులు తనెంత కష్టపడి వారాలు చేస్కుని చదువుకుంది. డిగ్రీ చేసి లా చదివి, ఓ సీనియర్ దగ్గర చేరడం, తరువాత అవకాశం వచ్చి గవర్నమెంట్‌లో చేరి

మునసబు, జడ్జి, హైకోర్టు జడ్జి అనడం అన్ని చెప్పుకొచ్చాడు.

''నన్నెలా గుర్తుపట్టారు మీరు. మిమ్మల్నయితే అసలు గుర్తించలేదు నేను'' అన్నాను కుతూహలంగా.

''పొడుగ్గా, తెల్లగా చూడగానే అన్పించింది మీరానాటి అమ్మాయిగారని. వయస్సుతో లావయ్యారు. కాని గుర్తుపట్టలేనంత మారలేదు మీరు'' అన్నారాయన.

ఈ వెంకటరమణని చిన్నప్పుడు ఎంత ఏడిపించేవాళ్లమో మేము. మా చిన్నప్పుడు మా అమ్మ వారానికి ఓ రోజు చొప్పున ఇద్దరు బ్రాహ్మలబ్బాయిలకి వారం ఇచ్చేది. వాలారబ్బాయి అంటే ఆరోజుల్లో బీదబ్రాహ్మణ అబ్బాయిలు, భుక్తి గడవడం కష్టంగా ఉన్న కుటుంబాల పిల్లలు ఇలా ఒకరోజు ఒకరింట్లో దయగల తల్లులు పెట్టే భోజనాలు తింటూ వారి పెరట్లో నూతి దగ్గర స్నానం చేసి, ఎవరింటి అరుగుమీదో పడుకుని, రాత్రిళ్లు వీధిదీపాల దగ్గర చదువుకుంటుండేవారు. వారానికి ఓ రోజు చొప్పున ఏడుగురింట్లో తినేవారు. ఆ రోజుల్లో స్కూళ్ళు కాస్త ఓ మాదిరి. పెద్దవూర్ల లోనే ఉండేవి. హైస్కూలు అయితే తాలుకా హెడ్‌క్వార్టర్సులోనే వుండేవి. ఆ కారణంగా పల్లెల నుంచి చదువుకోవడానికి బీద బ్రాహ్మణ కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు ఆర్థికస్తోమత లేక హాస్టల్లో ఉండలేక ఎవరింట్లోనో భోజనాలు కుదుర్చుకొని, జీతం డబ్బులు చందాలు పొగుచేసుకుని చదువుకునేవారు. అలా ఆనాడు చదువుకుని పైకి వచ్చిన వారెందరో లాయర్లు, డాక్టర్లు , కలెక్టర్లు, ఇంజనీర్లు అయ్యారని విన్నాను. చదివాను. ఆడవాళ్లు చెప్పుకునే వారు. ఫలానా వారింట్లో వారాలు చేసుకున్న పిల్లాడు మంచి చదువు ఉద్యోగం సంపాదించుకుని ఆ ఇంటివారమ్మాయిని కానీ కట్నం లేకుండా పెళ్లాడాడని, అలా వారాలు చేసుకని పైకి వచ్చిన పెద్ద ఉద్యోగల కథలు ఇక్కడ అక్కడ చదవడం, వినడం జరిగేది.

ఈ వెంకటరమణ తండ్రి ఆయావారపు బ్రాహ్మడు. తద్దినాలకి భోక్తగా వెడుతూ వచ్చిన నాలుగు ముక్కలతో వీరింట వారింట చిన్నపూజలు చేయిస్తూ ఆరుగురు పిల్లలని పోషించలేని బీదబ్రాహ్మడు. భుక్తి గడవటమే కష్టంగా ఉన్న అతను కొడుకును చదివించలేను పౌరోహిత్యంలో పెడతానంటే ఈ అబ్బాయి చదువుకుంటానని ఏడ్చి, గోల చేసి ఇంట్లోంచి పారిపోయి వచ్చేసి కొంతమంది బ్రాహ్మల ఇళ్లలో వారాలు కుదుర్చుకుని, ఓ కోమటాయన ఇచ్చే డబ్బుడో ఫీజు కడ్తూ, పాత పుస్తకాలు అడిగి తెచ్చుకుని చదువుకునేవాడు. ఈ వెంకటరమణ

ఎంత మంచివాడంటే ఎంత వినయంగా ఉండేవాడంటే వచ్చి భోజనం పెట్టమని కూడా అడగకుండా వీధరుగు మీద చదువుకుంటూ కూర్చునేవాడు. అమ్మే పాపం ''ఆ అబ్బాయి వచ్చినట్టున్నాడు. భోజనానికి రమ్మనండ్రా'' అంటూ పిలిపించితే పెరట్లో నూతి దగ్గర కాళ్ళు చేతులు కడుక్కుని విస్తరి ముందు వచ్చి కూర్చునేవాడు. ఇంట్లో నలుగురు ఆడపిల్లలున్నా మావంక ఎప్పుడూ కన్నెత్తి చూడనంత బుద్ధిమంతుడు. విస్తట్లో మాతోపాటు వడ్డించేది. ఔపోసనపట్టి, పెట్టింది తినడం తప్ప మారు కూడా అడిగేవాడుకాదు. ''కావాలంటే అడగపోతే ఎలా బాబూ. ఏం కావాలో'' అనేది అమ్మ. ''చాలండి, చాలండి'' అంటూ చేతులడ్డు పెట్టి'' మొహమాటపడేవాడు. ''తినవయ్యా మళ్ళీ రాత్రి వరకు ఏం తింటావు'' అనేది అమ్మ మరింత అన్నం వడ్డిస్తూ. శనివారం వంటిపూట బడి గనుక మధ్యాహ్నం మాతో పాటే పెట్టేది కాస్త దూరంగా ఆకువేసి. ఉదయం స్నానం అది చేసి స్కూల్‌కి వెళ్ళేముందు వచ్చి నిన్న మిగిలిన అన్నం మజ్జిగలో వేసి వుంచేది. ఊరగాయ ముక్క మూతమీద పెడ్తే వచ్చి గిన్నె వంచుకుని చద్దన్నం తిని వెళ్ళేవాడు. ఈ రమణ బుద్ధావతారం చూసి మాకందరికి ఆటపట్టించి ఏడిపించ బుద్ధేసేది. ఇటు వచ్చి అటు వచ్చి చిరుతిళ్లు, పండ్లు, వేరు శనగపప్పులు లాంటివి తినే మాకు ఆకలి అంటే ఎరగం. రమణ విస్తట్లో అన్నం కుంభంలా అనిపించేది. ఇంత వాయకలిపి గుంట చేసి పులుసో, చారో పోయించుకు అంతంత ముద్ద చేసి గుటుకు గుటుకు మింగుతుంటే కుంభకర్ణుడి తిండిలా అనిపించేది. అలా తమాషా చూస్తూ మేం సైగలు చేసుకుని నవ్వుకుంటుంటే అమ్మ ఉరిమి చూసేది. అమ్మ తరువాత తిట్టేది. ''మీ దిష్టితలిగేట్టుంది అబ్బాయికి. మీరంతా ఇటొచ్చి అటొచ్చి ఈ జంతికలు, చేగోడీలు, అరటిపళ్ళు మింగుతుంటారు. మీ కాకళ్లు వేయవు. ఆ అబ్బాయి పాపం ఈ పూట తింటే అపూటగా తినేది. అందులో ఎదిగే కుర్రాడు. ఆకలుండదా, పదిహేనేళ్లవాడు రాళ్ళు తిన్నా హరాయించుకునే వయసు, అసలు ఈ సారి మీతో పెట్టను'' అని కేకలేసేది మమ్మల్ని. ఏ మాటకామాటే చెప్పాలి. అమ్మ ఎవరిని కాదనకుండా ఏం పెట్టినా కడుపు నిండా పెట్టేది. ఆయవారం బ్రాహ్మడొచ్చినా, పనిమనిషైనా, చాకలయినా పండగొచ్చినా పబ్బాలొచ్చినా కాదనేది కాదు. ''మీరంతా కంచాల ముందు పారేసినంత ఉండదు ఆ అబ్బాయికి పెట్టేది. వారానికో రోజు ఇంతన్నం పెడ్తే పుణ్యమే కాని పాపం కాదు. ఏదో ఉన్నదానిలో కాస్త దానం, ధర్మం చేసుకోవడం అనేది''.

అమ్మ బయట చేరిన మూడు రోజులు మా పాల పడేవాడు రమణ పాపం. మేం అంతా కూడబల్కొని అన్నం పెట్టమని అడుగుతాడో లేదోనని చూసి

చూడనట్టు నటించేవాళ్లం. చూసి, చూసి అతనే కాళ్ళు కడుక్కు వచ్చి పీట వాల్చుకుని ఆకు కడిగి, నీళ్ల గ్లాసు పెట్టకునేవాడు. మేం చూడనట్టు నటిస్తే బిక్క మొహం పెట్టేవాడు. అది చూసి ముసిముసి నవ్వులు నవ్వేవాళ్లం. ''అబ్బాయి వచ్చాడు అన్నం పెట్టరేమర్రా'' అని అమ్మ అరిస్తే 'నువ్వు పెట్టునువ్వు పెట్టు' అని అక్కాచెల్లెళ్లం వాదులాడుకుని ఆఖరికి ఎవరో వకరం లేచేవారం. మారు అడిగే వాడు కాదు. ఆడుగుతాడో లేదోనని మేం పంతం. మజ్జిగ అన్నానికో, పప్పన్నంలోనో గుంట చేసుకుచారో, పులుసో, మజ్జిగ వేయండన్నట్టు తల దించుకు కూర్చునేవాడు. మేం చూడనట్టు నటిస్తే ఆఖరికి పాపం ఉత్తన్నం తినడం మొదలు పెడితే అప్పుడు జాలేసి పోసేవాళ్లం. 'ఎంత బుద్ధిమంతుడో, కన్నెత్తి చూడడు, పన్నెత్తి మాట్లాడడు, చదువులో ఫస్టు పైకి వచ్చే లక్షణాలు' అని అమ్మ మెచ్చుకోనేది. అన్నయ్య పాత నిక్కర్లు, షర్టులు ఇచ్చేది. ఓ చాప, పాతబొంత, దుప్పటి ఇచ్చింది. ఏడాదికి ఓ కొత్త జత బట్టలు స్కూలు తెరిచే ముందు కుట్టించేది. ఆ అబ్బాయి మెట్రిక్ చదువుతుండగా నాన్నగార్కి ట్రాన్స్‌ఫరయింది. ఆ అబ్బాయి పాపం ఎంతో దిగులు పడిపోయాడు. ''అమ్మగారూ నా దురదృష్టం కాకపోతే ఈ ఒక్క ఏడు గడిస్తే పై చదువుల మాట ఎలా ఉన్నా మెట్రిక్ అయ్యేది. మీరెళ్లి పోతున్నారు. మీరు అన్నపూర్ణలాంటివారు. ఇంతమంది పెడ్తున్నారు గాని మీలా దయగా, ప్రేమగా గౌరవంగా ఎవరూ పెట్టరు. మిగిలిన చద్దన్నాలు కాకుండా మీ పిల్లలతో సమంగా పెట్టేవారు. ఇంకో ఇల్లు వెతుక్కోవాలి'' అని ఏడ్చేశాడు. అమ్మ జాలిపడి మా బంధువులకి చెప్పి వారం కుదిర్చింది. ఓ పాత ట్రంకుపెట్టె, ఓ బాల్చి చెంబూ, ఓ కంచం, గ్లాసు లాంటివన్నీ ఇచ్చింది పాతబట్టలతోపాటు. అమ్మ కాళ్లు పట్టుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు రమణ. మాకు జాలేసింది అప్పుడు. ఇదంతా ఏభైయేళ్ల క్రితం సంగతులు. అదంతా ఇప్పుడు తల్చుకుంటే ఆ రమణని ఎలా ఏడిపించామో గుర్తొచ్చి సిగ్గుపడ్డాను. ''మిమ్మల్ని మేము భలే ఏడిపించేవారం. మీరు అలా బుద్ధావతారంలా తల దించుకు కూర్చుని తింటుంటే మాకు వినోదంలా ఉండేది. మీరు భోజనం ముందు కూర్చుని ఏం కావాలన్నా అడగరు, ఎందుకడగడు అని పంతం మాది. మీరేం అనుకునేవారో అదంతా ఇప్పుడు తల్చుకుంటే''... నిజంగానే బాధపడ్తూ, సిగ్గుపడ్తూ అన్నాను. ''భలేవారే, అప్పుడు మీకెంత వయసు, చిన్నతనంలో అలాంటి అల్లర్లు అంతా చేస్తారు. నాకేమో మీలాంటి అమ్మాయిల్ని కన్నెత్తి చూస్తే ఎవరేం అంటారోనని బిడియం, సిగ్గుగా ఉండేది. మీరంతా కల్సి నన్ను చూసి నవ్వడం. వేళాకోళం, చేయడం తెల్సినా పెద్దింటి పిల్లలు మీరు, మీతో ఎదురుపడగలనా'' తేలిగ్గా నవ్వారాయన.

''ఏమైనా అంత కష్టపడి మీరినాడు ఈస్థితికి వచ్చారంటే...''

''అంతా భగవ,తుడి కృప, మెట్రిక్ తర్వాత ఏ గుమస్తా ఉద్యోగమో చేద్దామనుకున్న గాని స్కూల్ ఫస్ట్ వచ్చిన నన్ను హెడ్‌మాస్టారుగారు ప్రోత్సాహించి కాకినాడ కాలేజికి పంపి స్కాలర్‌షిప్ ఇప్పించి, అక్కడ పుస్తకాలు అవి కొని ఇచ్చి ఇంకో పెద్దవారి దగ్గర ఇంట్లో భోజన సదుపాయం చేసి చదివించారు. ట్యూషన్లు చెప్పుకుని, ఆ వ్యాపారి ఇంట్లో పద్దులు రాసిపెట్టి, ఈ పని ఆ పని చేసి నాలుగు డబ్బులు ఆర్జించుకుని చదువుకొని పైకి వచ్చాను. డబ్బు విలువ, చదువు విలువ తెల్సినవాడిని గనక మా పిల్లలకి చిన్నప్పటి నుంచి వాళ్ల ధ్యేయం అంతా చదువే అవ్వాలని నా చిన్నతనం అంతా ఎన్ని కష్టాలు పడింది చెప్పేవాడిని'' అన్నారాయన.

''ఏమిటో ఎవరి అదృష్టానికి ఎవరు కర్తలు, అన్ని వనరులు, సదుపాయాలు కల్పించినా చదువుకోని పిల్లలు కొందరైతే, ఇక్కడ అక్కడా తిని చదువుకొని పైకి వచ్చినవారు కొందరు'' అన్నాను.

పెళ్లిచూపులయ్యాక అమ్మ దగ్గరికి తీసుకెళ్లాను. అమ్మని చూస్తూనే సాష్టాంగం పడిపోయి ''అమ్మా, నన్ను గుర్తు పట్టారా, సాక్షాత్తూ అన్నపర్ణమ్మగారేనమ్మా మీరు'' అన్నారు జడ్జిగారు.

అంత పెద్దమనిషి అలా కాళ్లమీద పడిపోతే అమ్మ గాభరా పడిపోయి ''అయ్యో.. అదేమిటి బాబూ, లేవండి లేవండి, ఏమిటో పెద్దతనం గుర్తుకురావడం లేదు. ఎవరు బాబూ మీరు'' అంది అమ్మ మొహమాటపడ్తూ.

''నేనండి వెంకటరమణని. మీ ఇంట్లో వారం చేసుకున్న రమణనండి. గుర్తు లేదా. రామచంద్రాపురంలో ఉండగా భోజనం పెట్టేవారు.''

''ఆ.. ఆ... ఆ రమణవా బాబూ. ఏమిటి జడ్జి అయ్యావా నాయనా...''

ఉత్త జడ్జి కాదమ్మా, హైకోర్ట్ జడ్జి, ఈయన పిల్లలంతా డాక్టర్లు, ఇంజనీర్లయి విదేశాలలో ఉన్నారు. వీళ్ల అబ్బాయే శిల్పని చూడడానికి వచ్చిన పెళ్లి కొడుకు'' అమ్మకి కాస్త చెవుడు వచ్చింది. గట్టిగా విడమర్చి చెప్పాను. వెంకటరమణ కొడుకుని పరిచయం చేసి ఆవిడకి దండం పెట్టించాడు.

''సంతోషం బాబూ. పైకి వచ్చావు. నాకు తెలుసు ఏదో ఒకనాడు నీవు పైకి వస్తావని చిన్నప్పుడు మాపిల్లలతో అనేదాన్ని. నీ బుద్ధిమంతనం చూసి నేర్చుకోమని.''

''అమ్మా! మా అబ్బాయికి మీ మనవరాలిని చేసుకుని మీరుణం కొంతైనా తీర్చుకునే అవకాశం ఇప్పించండి'' దండం పెడ్తూ అన్నాడు. అంతా కాస్సేపు కూర్చుని లేచారు.

పెళ్లివారు వెళ్లాక చిన్న చర్చ మొదలైంది. పెళ్లికొడుకు అందరికి నచ్చినా అందరిలో ఏమూలో చిన్న అసంతృప్తిలాంటిది మెదిలింది. తాత ఆయవారపు బ్రాహ్మడు, తండ్రి వారాలు చేసుకుని వచ్చిన సామాన్య వంశం అన్నది అనిపించినా ఎవరూ ఆమాట అనలేదు. బ్రిటీష్ వాళ్ల హయాంలో లాయర్లు, డాక్టర్లు. ఐ.పి.ఎస్‌లు అయిన తాతముత్తాతల వంశం నించివచ్చిన పెళ్లికూతురు మరి. స్టేటస్‌లో అంతర్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

''ఆ, వాళ్ల తాతలు ఏం చేస్తే మనకెందుకు, పెళ్లికొడుకు మంచి చదువు, ఉద్యోగం ఉంది'' అన్నాడు మాఅబ్బాయి.

''అవుననుకో, సమాన వియ్యం సమాన కయ్యం అంటారు. పిల్లనిచ్చినప్పుడు మనకంటె పైమెట్టువారికి, తెచ్చుకున్నప్పుడు కిందమెట్టునుంచి తెచ్చుకోవాలంటారు. ఇగో ప్రామ్లమ్స్ తలెత్తకూడదు తరువాత'' అన్నారాయన.

''ఆ తండ్రి ఎప్పుడో ఏదో చేసినా ఇప్పుడు హైకోర్టు జడ్జిగా మన అంతస్థుకు సరిపోయేట్టే ఉన్నారు. అబ్బాయి బాగున్నాడు, బుద్ధిమంతుడు అన్నీ కుదరాలంటే ఎలా'' అన్నాను.

''ఏమో, నిర్ణయం శిల్పకే వదిలేద్దాం. దానికి అబ్బాయి ఫ్యామిలీ నచ్చితే మన అభ్యంతరం అనవసరం'' అంది అమ్మాయి. ''శిల్పా చెప్పు, నీకేం అభ్యంతరం లేదుగా'' అల్లుడు అడిగాడు. ''పిల్లాడు నచ్చాడా'' తల్లి అడిగింది. శిల్ప తల ఊపింది. 'మరి ఫ్యామిలీ' తండ్రి అడిగాడు. శిల్ప ఒక్కక్షణం అందరి వంక చూసి ''మాతాతలు నేతులు తాగారు అని గొప్పలు చెప్పుకుంటూ డబ్బు, విలాసాల మధ్య బాధ్యతా రహితంగా పెరిగిన అబ్బాయిలకంటె కష్టం, సుఖం తెల్సి, చదువు విలువ తెల్సి స్వయంకృషితో పైకి వచ్చిన మనుష్యుల మెంటాలిటీ బెటర్‌గా ఉంటుందనుకుంటాను. ఇంతకీ ఇప్పుడు వాళ్లేం మనకి తగని అంతస్థులో లేరుగదా. మరెందుకు అభ్యంతరం వుండాలి. ఆ అబ్బాయి మంచివాడిలాగే, మానర్స్ తెలిసి, కల్చర్ ఉన్నవాడిలాగే ఉన్నాడు సెన్సాఫ్ హ్యూమర్, ఇంటిలెజెన్స్ కనిపించింది మాటల్లో మాట్లాడిన కాసేపటిలో. మిగలిది మా ఇద్దరి

మధ్య అండర్ స్టాండింగ్, ఎడ్జస్ట్‌మెంట్ బట్టి ఉంటుంది. మేరీడ్ లైఫ్ సాగాలంటే ఇద్దరం సర్దుకోవాలిగా మరి''.

'అమ్మబాబోయ్! చిన్నపిల్ల అనుకున్న శిల్పలో ఇంత చక్కగా, ఇంతదూరం ఆలోచించే శక్తి ఉందా, మానోళ్ళు మూతపడేట్టు జవాబిచ్చింది. ఈ కాలం పిల్లలకి గతం గురించి చింతలేదు. వర్తమానంలో బతుకుతారు. భవిష్యత్తు గురించి బెంగలేదు. వాళ్లకి కావాల్సింది వర్తమానం. ఈ తరం పిల్లలు ఎంతైనా తెలివైనవారు మరి.

(ఆంధ్రప్రభ వీక్లీ - జూన్ 2002)